# ప్రేమ వైఫల్యం



ఎస్.డి.వి. అజీజ్

"నీకు పెళ్ళయ్యిందా?"
"కాలేదు"
"నీ వయసెంత?"
"ముప్ఫై"
"నాకంటే నాలుగేళ్లు చిన్నోడి వన్న మాట!"
"......."
"పెళ్లెందుకు చేసుకోలేదు?"
"......."
"ప్రేమ విఫలమా?"
"కాదు"
"మరి?!"
"వైఫల్యం.."
"రెండింటి పదాల అర్థాలు ఒకటే అనుకొంటాను"
"కాదు"
"ఎలా?"
"విఫలమంటే?"
"ఫెయిల్యూరు"
"మరి వైఫల్యమంటే?"
"ఎడబాటు"
"నీ మాటలు విచిత్రంగా వున్నాయి"
"మనిషిని కూడ"
"నీ ప్రేమ ఎందుకు ఎడబాటుకు నోచుకుంది?"
"స్వార్థం ప్రేమను జయించి నందుకు"
"స్వార్థమంటే?"
"సంకుచితత్వం"
"ఎందులో?"
"మనిషిలో"
"నీ మాటలు అర్థం కావడం లేదు"
"కావు కూడ"
"తత్వవాదివా?"
"కాదు జ్ఞానవాదిని"
"అంటే?"
"అర్థం చేసుకో!"
"......"

*　　*　　*　　*

"ఎందుకొచ్చావు?"
"ఇక్కడి కెందుకు వస్తారు?"
"అందుకోసమే వచ్చావా?"
"......"
"నిలబడి వున్నావేం. . .కూర్చో!"
"ఎక్కడా?"
"ఇక్కడా... పక్కమీద"
"చోటు చాలదేమో?"
"చాలుతుంది... ఇది పుష్పక విమానం లాంటిది... 'పుష్పకవిమానం' అంటే గుర్తొచ్చింది.. నువ్వు.. ఆసినిమా చూశావా?"
"ఏ సినిమా?"
"పుష్పక విమానం"
"నే సినిమాలు చూడను"
"దేనికి?"
"ఇష్టం లేదు"
'సిగరెట్టు అలవాటుందా?"
"లేదు"
'నువ్వేం మగాడివయ్యా? సిగరెట్ అలవాటు లేని వాడు.. అసలు మగాడే కాదు నాదృష్టిలో..."
"....."
"పోనీ,... మందులవాటువుందా?"
"లేదు"
"యూ ఆర్ నాట్ మాన్"

"నీకు ఇంగ్లీషు కూడ వచ్చా?!"
"ఏం... 'కూడ' అంటున్నావు.. నీకొక్కడికేనా వచ్చేది. నీకంటే నాకు బాగావచ్చు!"
"ఎంత వరకు చదువుకొన్నావు?"
"జీవితం తుది అంచుల వరకు... ఏ యూనివర్శిటీ నేర్పని యూనివర్సల్ నగ్న సత్యాల్ని చూసి నేర్చుకొన్నాను."
"ఇక్కడి కెందుకు వచ్చావు?"
"యవ్వనం అందమైన ఓ అనుభవం అని చెప్పడానికి"
"ఎవరికి?"
"నీలాంటి వారికి"
"......"

*  *  *  *

"మాటల్లో పొద్దు పుచ్చడం నీ అభిమతమా?"
"కాదు"
"మరి ఈ ఆలస్యం?"
"......."
"ఎప్పుడైనా 'ఆ' అనుభవాన్ని రుచి చూశావా?"
"ఏ అనుభవాన్ని"
"ఈ అనుభవాన్ని"
"చూళ్లేదు"
"అందుకే కాబోలు ఈ తాపత్రయం"
"ఇది తాపత్రయం కాదు"
"మరేమిటి?"
"ఆరాటం"
"ఆరాటమా? అంటే?!"
"మానసిక అలజడి"
"ఎవరిలో?"
"నాలో"
"నీలోనా?"
"అవును..."
"ఎందుకొచ్చింది?"
"చెప్పానుగా!"
"ఏమని?"
"బాధనీ"
"ఎడబాటన్నావు"
"రెండూ ఒకటే!"
"చలాన్ని అనుకొంటున్నావా?"
"చలమా? అతనెవరు?"
"ఓ అభాగ్యుడు"
"అభాగ్యుడా?"
"అవును అభాగ్యుడే! ఈదేశ ప్రజానీకం లోని జఢత్వాన్ని పెకిలించి వెయ్యాలని రేయింబవళ్ళు శ్రమించిన ఓ అక్షర శ్రామికుడు నీలాగే పరితపించి పోయి పిచ్చి వాడై పరుగులు తీసిన ఓ మేధావి"
"అతను పిచ్చివాడా?"
"నా దృష్టిలో కాదు"
"మరెవరి దృష్టిలో?"
"ఈ జనం దృష్టిలో..."
"అతని కథ చెప్పవూ?"
"చెబితే నీ గుండె గాయ మౌతుంది"
"అమ్మో అయితే వద్దు!"
"పిరికి వాడవయ్యా వెందుకు?"
"........"

*  *  *

"ఎక్కడా బాధ?"
"ఇక్కడా!"
'అబ్బో..! నీ ప్రేయసి చేసిన గాయం చాల పెద్దదయ్యిందే!"



"అవును.. వగచే కొద్దీ ఎక్కువవుతూ వుంది."
"వగచడం మాని వెయ్యి"
'ప్రాణం పోతుంది"
"ఈ బాధలోనే సుఖముందా?"
"వుంది"
"అయితే నాదగ్గరికి ఎందుకొచ్చావు?"
"నా గుండె గాయానికి మందు కావాలి"
"నాదగ్గర ఎలా వుంటుంది?"
"వుంటుందని వచ్చాను"
"లేదు"
"....."
"వెళ్లిపోతున్నావేం?"
" 'మందు' లేదన్నావుగా!"
"లేదనగానే వెళ్లిపోవడమేనా?"
"......."
"వెళ్లకు ఇస్తాను"
"ఇందాక లేదన్నవుగా?!"
"అందరి లాంటి వాడివనుకొన్నాను"
"మరిప్పుడు?"
"కొందరి లాంటి వాడివని తెలుసు కొన్నాను"
"నువ్వెంత మంచిదానివి... అరె! ఎందుకేడుస్తున్నావు?"
"నీ మీద ప్రేమ పుట్టి"
"ప్రేమా!!"
"అవును"
"అయితే వద్దు!"
"ఏమిటి వద్దు!"
"మందు"
"ఇందాక కావాలన్నావుగా!"
"అడిగింది మందేకాని ప్రేమ కాదు"
"ప్రేమంటే ఎందుకు నీ కింత భయం?"
"భయం కాదు.. భక్తి!"
"నువ్వీజన్మలో బాగు పడవు"
"ఆ ఉద్దేశ్యం తోనేగా ఇక్కడి కొచ్చింది"
"చెడి పోవాలని వుందా?"
"చెడాలని వుంది"
"నీకు పిచ్చా?"
"నాకూ అలాగే అనిపిస్తోంది"
"మరి అలాటి వాడివి పిచ్చాసుపత్రికి పోక ఇక్కడి కెందుకు వచ్చావు?"
"నా పిచ్చికి డాక్టర్ల ఇంజెక్షన్లు పనిచెయ్యవు"
"మరి నాలాంటి వాళ్లు పనికొస్తారా?"
"అవును.. అందుకే.. వచ్చింది"
"నీ పిచ్చి నేభరించలేను"
"ఈ పిచ్చినే భరించలేని దానివి.. మరి నా గుండె గాయానికి మందెలా ఇస్తావు?"
"......."

*  *  *

"ఏడుస్తున్నావెందుకు?"
"విజయ గుర్తొస్తోంది"
"కాసేపు నన్ను నీ విజయే అనుకో!"
"అనుకోను"
"ఎందుకు?"
"నీవు నాఅమ్మవు"
"......"

*  *  *

● మానసిక రుగ్మతలకి మెడికల్ స్టోర్ - గ్రంధాలయం !